క్లుప్తంగా

ఆనందరెడ్డి సేవలు అభినందనీయం



ఆనందరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న రాజేష్

వరదయ్యపాళెం: కొండారెడ్డి రాయలసీమ విద్యా సంస్థల అధినేత ఆనందరెడ్డి సేవలు శ్లాఘనీయమని సత్యవేడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ అన్నారు. ఆదివారం ఆనందరెడ్డి జన్మదినం సందర్భంగా తిరుపతిలోని ఆయన నివాసంలో రాజేష్ పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటు వైఎస్సార్‌సీపీకి, అటు విద్యాసంస్థల అధినేతగా ఎంతో మంది పేద విద్యార్థుల చదువుకు ఆనందరెడ్డి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. నాయకులు భానుప్రకాష్ రెడ్డి, సోము, సత్యవేడు సింగిల్ విండో చైర్మన్ నిరంజన్‌రెడ్డి, సత్యవేడు సర్పంచ్ వెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ దేవతకు పొంగళ్లు

సత్యవేడు: మండలంలోని అల్లపుగుంట గ్రామంలో అంకమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పొంగళ్లు పెట్టి మహిళలు నివేదించారు. మూడురోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మునస్వామి తెలిపారు. రాత్రి పూజల అనంతరం పొంగళ్లు తీసుకొని మహిళలు ఊరేగింపుగా ఇళ్లకు బయలు దేరారు. ఊరేగింపు ముందు తప్పెట్లు, మేళ తాళాలతో యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

ప్రమాదకరంగా మలుపులు


నెరిణికండ్రిగ వద్ద మలుపు

బుచ్చినాయుడుకండ్రిగ: కేటీరోడ్డుకు కాళంగి వంతెన, నెరిణికండ్రిగ, తానిగిల్లు, తలారివెట్టు, కాటూరు, వల్లమాలకండ్రిగ గ్రామాల వద్దనున్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఈ మలుపులు ఎస్ ఆకారంలో ఉండడంతో ఎదురు వచ్చే వాహనాలు దగ్గరకి వచ్చేంత వరకు కనిపించడం లేదు. వేగంగా వచ్చే వాహనాలు మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. ప్రతి మలుపు వద్ద ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. మలుపులకు ఇరువైపులా వేగనిరోధకాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండల ప్రజలు వాపోతున్నారు.

కల్వర్టుకు గోడలు నిర్మించండి


కల్వర్ట్‌పై ఏర్పడిన గొయ్యి

బుచ్చినాయుడుకండ్రిగ: కల్లివెట్టు గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఉన్న కల్వర్టుకు ఇరువైపులా గోడలు లేవు. దీంతో వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టుకు పెద్దగొయ్యి ఏర్పడి ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టును నిర్మించిన అధికారులు యిరువైపుల గోడను నిర్మించాలన్న సంగతిని మరచిపోయా రు. గోడలు లేకపోవడం, గొయ్యి ఉండడంతో వాహనాలు కల్వర్టులో పడి పోతున్నాయి. కల్వర్టు గోడలను నిర్మించాలని పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాహనదారులు అంటున్నా రు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుకు గోడను నిర్మించాల్సి ఉంది.

ముక్కంటి సేవలో సింహాచల ఆలయ ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం సింహాచల ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దర్శించుకున్నారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆయనను ఆశీర్వదించి, జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కలవకొండలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చిల్లకూరు : మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నరసింహస్వామి జయంతిని పురస్కరించుకుని ఆరు రోజులు పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వేద పండితులు కలశ స్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సోమవారం ధ్వజారోహణం నిర్వహిస్తామని తెలిపారు. ఈవో శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

31,702 మంది ఓటుకు దూరం

- సత్యవేడు నియోజకవర్గంలో ఓటు వేయని వారు 31,702 మంది
- 2019లో సైతం ఓటుకు దూరంగా 27,487 మంది ఓటర్లు
- గతంలో కంటే పెరిగిన 4,215 మంది ఓటర్లు

వరదయ్యపాళెం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి వేలాది మంది ఓటుకు దూరమయ్యారు. కారణాలు ఏమైనా ఉన్నాయో తెలియదుగానీ పోలింగ్ శాతం తగ్గినట్లు తెలుస్తోంది. పారిశ్రామిక ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గంలో ఈ సారి పోలింగ్ శాతంపై అటు రాజకీయ పక్షాలు, ఇటు పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రతిసారి ఎన్నికల్లో 30 వేలకు పైగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోకపోవడం మాత్రం చర్చనీయాంశమవుతోంది. ఉద్యోగాల కోసం, ఉపాధి కోసం బయట ప్రాంతాలకు వెళ్లిన వారు సొంత ఊర్లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారా లేదా అన్న పలు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నియోజకవర్గంలో 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 86.52 శాతం, 2024లో జరిగిన ఎన్నికల్లో 85.28శాతం ఓట్లు పోలయ్యాయి.

ఓటుకు దూరంగా..:

నియోజకవర్గంలో జరిగిన అన్ని ఎన్నికల్లోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోని పరిస్థితి కనిపిస్తోంది. 2,15,385 మంది ఓటర్లు ఉన్న సత్యవేడు నియోజకవర్గంలో 31,702 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 2019లో సైతం 2,02,771 మంది ఓటర్లకు గాను 27,487 మంది ఓటింగ్‌కు దూరమయ్యారు. ఇంతపెద్ద సంఖ్యలో ఓటర్లు ఓటు వేయకపోవడం ప్రజాస్వామ్యవాదులను కలవరపరుస్తోంది. ఓటు రాకపోతే సంబంధిత అధికారులపై శివాలెత్తే దరఖాస్తుదారు, ఓటు వచ్చిన తర్వాత దాన్ని వినియోగించుకోవడంపై శ్రద్ధ చూపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2019 ఎన్నికల నాటికి సత్యవేడు ఓటర్ల సంఖ్య 2,02,771 మంది కాగా ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 2,15,385 మందికి పెరిగింది. గత ఎన్నికల కంటే ఈసారి ఓటింగ్‌కు దూరమైన వారి సంఖ్య 4,215 మంది పెరిగినట్లుగా తెలుస్తోంది. ఓటింగ్ కూడా గత ఎన్నికల కంటే ఈసారి ఒక శాతం తగ్గింది. వజ్రాయుధాన్ని ఓటర్లు వినియోగించుకోకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేసింది.

పెద్ద కాళహస్తి మహత్యం పుస్తకావిష్కరణ


పెద్ద కాళహస్తి మహత్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేడసాని మోహన్, ఈఓలు రామారావు, నాగేశ్వరావు, ప్రముఖులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని ఓ ప్రవేటు కల్యాణ మండపంలో ఆదివారం ధూర్జటి ముని మనవడు ధూర్జటి లింగరాజు కవి రచించిన పెద్ద శ్రీకాళహస్తి మహత్యం గ్రంథాన్ని పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. ధూర్జటి రచించిన తాళపత్ర గ్రంథాన్ని పుస్తక రూపంలో తీసుకు రావడంలో పట్టణానికి చెందిన సాహితీ వేత్త దివంగత లగడపాటి భాస్కర్ పరిష్కర్తగా వ్యవహరించారు. పంచ సహస్రావధాని మేడసాని మోహన్ తుదిరూపు దిద్దారు. ఆవిష్కరణ సభలో మేడసాని మోహన్ మాట్లాడుతూ పెద్ద కాళహస్తి మహత్యం సంస్కృత తాళపత్ర గ్రంథాన్ని తెలుగులో పుస్తకరూపంలో తీసుకువచ్చే అవకాశం తనకు లభించడం పూర్వజన్మ సుకృతమన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈఓ రామారావు మాట్లాడుతూ గ్రంథాన్ని పుస్తకరూపంలో తీసుకురావడంతో లగడపాటి భాస్కర్, మేడసాని మోహన్ కృషి మరువలేనిదన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, సింగరాజు ప్రకాశం శాస్త్రి, అష్టావధాని ఆముదాలమురళి, లగడపాటి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడి ముత్యాలమ్మ ఆలయంలో కంకణం ధరించిన భక్తులు ఆదివారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఉదయం ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. మధ్యాహ్నం గ్రామంలోని మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పండరి భజన భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం కంకణం ధరించిన భక్తులు ఏడు ఎల్లలు నడిచి స్నానమాచరించి ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికే సిద్ధం చేసిన అగ్నిగుండంలో సాంప్రదాయబద్ధంగా ప్రవేశించి మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పాలు పద్మనాభం పర్యవేక్షించారు.


అగ్నిగుండం ప్రవేశం చేస్తున్న కంకణం ధరించిన భక్తులు

కాణిపాకం అన్నదానం ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం


విరాళ డీడీని అందిస్తున్న మునిశేఖర్ నాయుడు దంపతులు

పిచ్చాటూరు: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ నిత్యాన్నదాన పథకానికి పిచ్చాటూరుకు చెందిన మంజు ట్రేడర్స్ చైర్మన్ పెమ్మసాని మునిశేఖర్ నాయుడు దంపతులు రూ.5 లక్షలు విరాళాన్ని అందించారు. ఆదివారం కాణిపాకం ఆలయానికి వెళ్లిన వారు దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డిని కలిసి ఈమేరకు విరాళం అందజేశారు. దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపి, శ్రీస్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు.

జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయం


అమ్మవారి సేవలో నూకతోటి రాజేష్, నాయకులు

పిచ్చాటూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని కీళపూడిలో శ్రీముత్యాలమ్మ ఆలయ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అగ్నిగుండ ప్రవేశాన్ని ఆయన తిలకించారు. అంతకుముందు గర్భగుడిలోని శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం వెలుపల రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే గతంలో కన్నా ఎక్కువ సీట్లతో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. జగనన్న సంక్షేమ పాలనపై జనం ఫిదా అయినట్లు తెలుస్తోందని తెలిపారు. సత్యవేడులో సైతం తాను మెజారిటీతో గెలవడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఆలయ ధర్మకర్త పాలుపద్మనాభం రాజేష్ తీర్థ ప్రసాదాలు అందించారు. అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. ఏఎంసీ చైర్మన్ సునంద, పార్టీ మండల అధ్యక్షుడు చలపతి రాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ కిరణ్‌కుమార్, మండల పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముద్దుకృష్ణమరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డివారి లోకేష్ రెడ్డి, చంద్రన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మృతులకు నివాళి


కొవ్వొత్తులతో నివాళులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నగరివీధిలో ఆదివారం స్టెప్స్ సంస్థ కార్యాలయంలో 41వ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్‌డేను నిర్వహించారు. పథక సంచాలకురాలు డాక్టర్ ప్రమీలమ్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మేనెల 3వ ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఎయిడ్స్‌తో మరణించినవారు, వ్యాధితో బాధపడేవారు, వారి కుటుంబీకులను గుర్తించుకునే విధంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి ఆకాశంలో వాటిని చూపుతూ మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రసాదాలకు రూ.20 వేల వితరణ



రాపూరు : పెంచలకోనలో నిర్వహించే లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఉచితంగా ప్రసాదాలు అందజేసేందుకు రూ.20 వేలు అందించినట్లు ఎల్‌ఐసీ నెల్లూరు డివిజనల్ మేనేజర్ వెంకటేశ్వర్రావు తెలిపారు. ఆయన ఆదివారం పెంచలకోనలో ఎల్‌ఐసీ స్టాల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల సమయంలో ఎల్‌ఐసీ తరఫున విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ సిబ్బంది జనార్దన్, వెంకటేశ్వర్లు, నాగయ్య, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి జీవితం నేటితరానికి ఆదర్శం


శ్రీకాళహస్తి: నివాళులు అర్పిస్తున్న సీపీఎం నేతలు


నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నేతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పుచ్చలపల్లిసుందరయ్య భవన్‌లో ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు అంగేరి పుల్లయ్య ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సంర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంధం మణి, పెనగడం ఈశ్వరయ్య, రెడ్డిపల్లి సురేష్, బాలకృష్ణ, రెడ్డి వేణు, అన్వర్‌బాషా, కుమార్, వెంకటేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లికి నివాళి

ఏర్పేడు: స్థానిక అశోక్‌నగర్‌లో ఆదివారం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి అర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పలువురు వక్తలు సుందరయ్య సేవలను కొనియాడారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు రంగయ్య, వెంకటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తారకరామానగర్‌లో..

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి హరినాథ్, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, నాయకులు దిలీప్‌బాషా, సెల్వరాజ్, కుప్పస్వామి, ఈశ్వరమ్మ, సత్యశ్రీ, రాజశేఖర్, శివానందం, చీరాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


కిందకు కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు


కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్


బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల పంచాయతీ పరిధిలోని నుద్దమిట్ట గిరిజన కాలనీ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్‌వైర్లుతో ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు కంచెను ఏర్పాటు చేయక పోవడంతో వైర్లు తగులుతున్నాయి. అదేవిధంగా పొలాల్లోని విద్యుత్ వైర్లు కిందకు ఉండడంతో రైతులు పొలంలోకి వెళ్లడానికి భయపడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని పొలాల్లో కిందకు ఉన్న వైర్లు ఎత్తుకు లేపాలని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు, గిరిజనులు వాపోతున్నారు.


గొల్లపొయిన ఆలయం వద్ద శ్రీవారికి పూజలు చేస్తున్న అర్చకులు

అంగరంగ వైభవం

పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా స్వామి వారు ఆదిలక్ష్మి, చెంచులక్ష్మితో కలిసి తోగోనుపల్లిలోని అత్తారింటి నుంచి కోనకు చేరుకున్నారు. తర్వాత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. - రాపూరు


విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు


ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ

పంటల బీమా.. రైతులకు ధీమా

- ఈ క్రాప్ నమోదు చేసుకునే రైతులందరికీ పథకం వర్తింపు
- ఖరీఫ్ పంటల సాగుకు రైతుల సన్నద్ధం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

పిచ్చాటూరు: రైతును రాజును చేయాలంటే వ్యవసాయం లాభసాటిగా ఉండాలి. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వారికి ఆర్థిక భరోసా కల్పించాలి. రైతుపై భారం పడకుండా ప్రభుత్వమే పంట బీమా ప్రీమియం చెల్లిస్తూ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందుకు రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులు లేదా వ్యవసాయ సిబ్బంది ద్వారా రైతు తమ పంటలను ఈ క్రాప్ నమోదు చేసుకుంటే చాలు. వైఎస్సార్ ఉచిత బీమా పథకం వర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్‌లు, వరదలతో పంట నష్టం ఏర్పడితే ప్రభుత్వం రైతులకు బీమా మొత్తం చెల్లిస్తుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతు భరోసా కేంద్రాలకు వచ్చి రైతులంతా ఈ క్రాప్ నమోదు ద్వారా పంటల బీమా చేసుకుంటున్నారు.

ప్రీమియం ఉచితంతో ఆనందం

గతంలో రైతులు సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా వరికి రూ.640, పత్తికి రూ.1850, మిరపకు రూ.3150, మొక్క జొన్నకు రూ.435, వేరుశనగకు రూ.1000, పసుపు పంటకు రూ.10 వేలు, జొన్నకు రూ.750, సజ్జకు రూ.750 బీమా ప్రీమియం రైతులు చెల్లించేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు తమ పంటలను ఆర్‌బీకే సిబ్బంది సాయంతో ఈ క్రాప్ యాప్ ద్వారా నమోదు చేసుకుంటే చాలు. ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుండడంతో రైతులకు ఎంతో ఉపశమనం కల్పిస్తుంది. నియోజకవర్గంలో ప్రధానంగా వరి, వేరుశనగ, సజ్జ పంటలు ఎక్కువగా పండిస్తుంటారు. వీరందరి పంటలకు ఈ క్రాప్ నమోదు ద్వారా ఉచితంగా పంట బీమా చేసుకుంటున్నారు.


పిచ్చాటూరులో దుక్కి దున్నుతున్న రైతు

ఆర్‌బీకేలను సంప్రదించాలి



ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుండడంతో రైతుల నుంచి పంటల బీమా పథకానికి విశేష స్పందన లభిస్తోంది. ఆర్‌బీకే లోకి వ్యవసాయ సహాయకుని ద్వారా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి. బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు యథావిధిగా బీమా రెన్యూవల్ అవుతుంది. ఖరీఫ్ పంటల సాగు చేసే వారు సద్వినియోగం చేసుకోవాలి

-సంజీవ రెడ్డి, ఏఓ, పిచ్చాటూరు